# అమ్మ

పెనుగొండ లక్ష్మీనారాయణ

సుబ్బమ్మ చావు బ్రతుకుల్లో వుందన్నవార్త ఆనోటా ఆనోటా వూరంతా పాకిపోయింది. వయోభారంతో నడుం వంగి వొంట్లో ఓపికలేకున్నా పేడ పలికతో పశువుల మంద వెంటబడి పేడ పోగేసుకునే సుబ్బమ్మంటే ఎవరికీ లెక్కలేదు. అయితే మెట్టినింట అడుగుపెట్టినప్పటి నుండి ఆవిడ పడ్డ కష్టము ఎరిగున్న కొద్దిమంది పాపం అనుకున్నారు. ఊళ్ళోవున్న నాలుగైదు కుటుంబాల బంధువర్గం, లోకం ఏమనుకుంటుందోనన్న భయంతో మాత్రం తులసినీళ్ళు గొంతులో పోయటానికి సిద్ధపడ్డారు.

సుబ్బమ్మ వొక్కగానొక్క కొడుకు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి టెలిగ్రామ్ ఇచ్చారు. పదేళ్ళుగా తల్లి ముఖమే చూడటానికి రానివాడు యిప్పుడు మాత్రం వస్తాడా అన్న అనుమానం కొందరు వ్యక్తం చేశారు.

'ఎందుకు రాడేం? ఇవాళ వాడు అంతటి వాడయ్యాడంటే అది సుబ్బమ్మవల్లనే కాదూ!' అన్నారెవరో!

ఆ మాటలకెవరూ అభ్యంతరం చెప్పలేకపోయారు.




కొడుకు పొత్తిళ్ళలో వున్నప్పుడే భర్త అర్ధాంతరంగా చనిపోతే, కూలీనాలీకెళ్ళా రెక్కలు ముక్కలు చేసుకుని కొడుకుని పెద్ద చదువులు చదివించింది. కొడుక్కి మంచి ఉద్యోగం రావంటతోటే ఓ యింటివాడిని చేసింది.

తల్లి వొంటరిగా ఊళ్ళోవుండి ఇంకా కూలి పనుల కెళ్ళటం కొడుక్కి యిష్టంలేకపోయింది. తనతోపాటే వచ్చివుండమన్నాడు. తండ్రి శరీరం బొగ్గయిన మట్టిలోనే తన కట్టె కలిసిపోవాలన్న కోరికతో ఊరు వదిలి రానంది. నెలకింతని పంపుతాను కూలిపనులు మానమన్నాడు. పంపిన డబ్బుని తిప్పికొట్టేసింది. అడపాదడపా వచ్చిపోవటం మినహా తల్లి నిర్ణయాన్ని ఏ మాత్రం మార్చలేకపోయాడు.

అరవయ్యేళ్ళు పైబడేటప్పటికి సుబ్బమ్మకి కూలి పనులు చేసే సత్తువ లేకపోయ్యింది.

ఉదయం పశువులమందలని పొలాలకు తోలే వేళకు పలికతో సిద్ధమయ్యేది. ఆ మందలవెంటబడి పేడకళ్ళు పోగుజేసేది. వడ్లపొట్టు తెచ్చి పేడతొక్కి పిడకలు చేసేది.

ఎండిన పిడకలను వందకింత ధర చొప్పున దాలి గుంటల్లోకి, కార్ఖానాలకు అమ్మేది. అప్పటినుండి పిడకల సుబ్బమ్మగా అందరికీ లోకువైంది.

పశువుల కాపర్లతో సహా అంతా ఎగతాళి పట్టించేవాళ్ళు. పిల్లలు వెంటబడి, యిసుకజల్లి గోలగోల చేసేవాళ్ళు. పెద్దవాళ్ళకు అది వినోదంగా వుండేదికాని మందలించేవారు కాదు.

ఈ ముసలిముండకు డబ్బుమీద యింతయావ ఏమిటని చాటున కొందరంటే, మరికొందరు ముఖం మీదనే అనేవారు. సుబ్బమ్మ ఆ మాటలనేమీ పట్టించుకునేది కాదు.

ఈ విధంగా తల్లి నలుగురిలోనూ నవ్వులపాలవటం కొడుకు సహించలేకపోయాడు. తల్లిమీద మండిపడ్డాడు. మూటాముల్లె సర్దుకుని తనతో బయల్దేరమన్నాడు. కొడుకు మాట వినలేదు.

"నా మాట విననంత కాలం నేను నీ కొడుకునే కాదు. నీ ముఖం చూడను" అంటూ కళ్ళనీళ్ళ పర్యంతమై వెళ్ళిపోయాడు. ఆ వెళ్ళటమెళ్ళటం పదేళ్ళ

వుతున్నా తొంగిచూడలేదు.

కొడుకువెళ్ళిన కొద్ది రోజులకే, తన భర్తకి పిత్రార్జితంగా వచ్చిన ఎకరం పొలం అమ్మి ఆ డబ్బు కొడుక్కి పంపేసింది.

సుబ్బమ్మ మెల్లగా కళ్ళువిప్పి చుట్టూ మూగిన వాళ్ళని తేరిపార చూసింది. కొడుకుకోసమే వెతుక్కుంటుందనుకున్నారు. ఏ డిగ్రీలు లేని ఓ డాక్టరుకాని డాక్టరు యింజక్షన్లు పొడుస్తున్నాడు. ఇంకా మంచి వైద్యం జరగాలంటే పట్టణం తీసుకెళ్ళాలి. లేదా అక్కడ నుండి పెద్ద డాక్టరుని తీసుకురావాలి. రెండూ సాధ్యంకాని పనులని ఎవరూ పట్టించుకోలేదు.

"నీ కొడుకు యింకా రాలేదు సుబ్బమ్మా, కబురు పంపాం. వచ్చేస్తుండాలి!'' అన్నారెవరో!

సుబ్బమ్మ కష్టంమీద పెదవులు విప్పింది. "ప్ర...సి...రెం...టును... పి...ల...వం...డి...'' అన్నది.

అంతా ఆశ్చర్యపోయారు. సుబ్బమ్మకు ప్రెసిడెంటుతో ఏం పనివుందో అర్థంకాలేదు. కూడబెట్టిన సొమ్ము కొడుక్కిమ్మని అప్పగిస్తుంది కాబోలు!

ప్రెసిడెంట్ వచ్చాడు. "సుబ్బమ్మా! ఏంకావాలి!'' అడిగాడు.

జనం వుత్కంఠతో చూస్తున్నారు. సుబ్బమ్మ బొడ్డు తడిమింది. తాళంచెవులు తీసి ఆయన చేతిలో పెట్టింది. "దా...చిన డ...బ్బులన్నీ... తీసుకోండి. ఆసుపత్రి కట్టించండి'' అతి కష్టంమీద వెలువడ్డాయి మాటలు. మళ్ళీ మగతలోకి జారింది.

జనంనోట మాటలేదు. నలభయ్యేళ్ళనాటి సంగతి అందరి మనస్సుల్లోనూ మెదిలింది. సుబ్బమ్మ భర్త ఏ విధంగా చనిపోయిందీ గుర్తొచ్చింది. పొలం నుండి తిరిగొస్తూనే కుప్పలా కూలిపోయాడు. నోటివెంట నురుగు వస్తూంటే పాము కరిచిందనుకున్నారు. ఊళ్ళో హాస్పిటలే కాదు మంచి డాక్టరయినా లేదు. వెంటనే బండికట్టి పట్నంవైపుకు పరిగెత్తిచ్చారు. మధ్యదారిలోనే అతను చనిపోవటంతో బండి వెనుతిరిగి వొచ్చింది. సుబ్బమ్మ పసుపు కుంకుమలు రాలిపోయాయి.

అంతలో సుబ్బమ్మ కొడుకు కారేసుకుని వచ్చాడు. తల్లి ఔదర్యాన్ని నలుగురూ అతనికి చెప్పారు. ఆమెని చేతుల్లోకి తీసుకుని మూగగా ఏడ్వసాగాడు. కొడుకు రాకను పదేపదే ఆమె చెవుల్లో వూదారు.

కళ్ళు విప్పింది. కొడుక్కి ఏదో చెప్పాలనుకుంది కానీ వెంటనే గొంతు పెగల్లేదు.

"ఆ...సు...ప...త్రి... 'డబ్బు...' అస్పష్టంగా వెలువడ్డాయి మాటలు.

"అలాగేనమ్మా! నీ కోరిక తప్పక తీరుతుంది.'' అన్నాడు కొడుకు.

కాసేపటికి ఆమె ప్రాణాలు పోయాయి. ఈ వార్త క్షణాలమీద ఊరంతా తెలిసిపోయింది.

ఆమెనింతకాలం అర్థం చేసుకోలేకపోయినందుకు కన్న కొడుకేకాదు; ఊరు ఊరంతా ఏడ్చింది. ●

